# ఖాకీ బతుకులు

**జి. మోహన్ రావు (స్పార్టకస్)**

*(రెండో ముద్రణ. 1998 జనవరి. 2000 కాపీలు)*

## అనే నవలపై డెట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ సభ్యుల చర్చ

(తేది.డిసెంబరు 7, 2003, స్థలం.ఫర్మింగ్టన్ హిల్ లైబ్రరీ)

*చర్చలో పాల్గొన్నవారు:* కందాళ శ్రీనివాసాచార్య (ముఖ్య చదువరి), మద్దిపాటి విజయ, లోకం పద్మజ, నందుల లక్ష్మి, నందుల మురళీ కృష్ణ, పాశం విద్యాసాగర్, ఆరి సీతారామయ్య, ముసునూరు ఆనంద్, అల్లా గణేష్, గాదె శ్రీనివాస జగన్నాథ్, బూదరాజు కృష్ణమోహన్, బసబతిన శ్రీనివాసులు, మద్దిపాటికృష్ణారావు గార్లు.

*సమీక్షకుడు:* కందాళ శ్రీనివాసాచార్య

**ఖా**కీ బతుకులు అన్న పేరులోనే దీని కథ ఏమిటో, దేని గురించో తెలిసిపోతుంది. అలాగే రచయిత తన మాటల్లో - సమకాలీన సమాజంలోపోలీసు కానిస్టేబులు చుట్టూ అల్లుకుపోయిన కుల, మత, ఆర్థిక, రాజకీయ సమస్యలతో పాటు అధికార ఆగడాలనూ, ఉద్యోగ సమస్యలనూ, తన కళ్ళ ముందుజరిగే అన్యాయాన్ని ఏమాత్రం ఎదిరించలేని కానిస్టేబులి అశక్తతనూ ఈ నవలలో చెప్పడానికి ప్రయత్నించాను- అనిముందుగానే వివరించారు.

దాదాపు 572 పేజీల (రెండో ముద్రణ) ఈ పుస్తకంలోని, తొలి 114 పేజీలు మొదటి ముద్రణలోనే ఇది కలిగించిన సంచలనాన్ని చర్విత చర్వణంగా చెబుతాయి. అంటే - కథానాయకుడు ప్రకాశం కానిస్టేబులుగా చవిచూసిన చేదు అనుభవాల పరంపరలో, పై అధికారులను అదేమని అతడు అడిగినా అడగకపోయినా, చెప్పుడు మాటలకే ఇంక్రిమెంటు కట్టో లేక శంకరగిరిమాన్యాల పట్టో అన్న డిపార్టుమెంటు - తనలోని లుకలుకలను నగ్నంగా బట్టబయలుచేసినందుకు రచయితపై ధ్వజమెత్తిన వైనం, పాఠక పత్రికాలోకుల స్పందనలు, విన్నపాలు, రచయితతో ముఖాముఖీలు, ఆవిష్కరణల ఉపన్యాసాలు, సమీక్షలు వగైరాలు తెలుగులోను, ఇంగ్లీషులోనూ రెండో ముద్రణ పాఠకుడి బుర్రను వేడెక్కించక మానవు కథ మొదలెట్టేసరికి. ఇలా ఇన్ని పేజీలను కథ ముందు చేర్చడం రచయిత, ప్రచురణకర్తల ఉద్దేశ్యం మంచిదే అయినా కథలోని సారమంతా ముందే వచ్చేసి ఇంకేముంది కథ, ఇంకో 458 పేజీలు అబ్బా ఎవరు చదువుతారు అని పాఠకుడు చెరకులోంచి రసం తీసి పిప్పిని పారేసినట్లు అసలు కథ చదవకుండా పుస్తకాన్ని పక్కన పడేసే ప్రమాదం లేకపోలేదు. అసలే, మొదటి ముద్రణలో వెయ్యి కాపీలు అమ్ముడయ్యాయని రెండో ముద్రణలో మరింత ఉత్సాహంతో, రెండు వేల కాపీలు అచ్చు వేశారు మరి. ఈపేజీలను కథ తర్వాత చేర్చివుంటే పాఠకుడు ముందు కథను ఆసక్తిగా చదివడమేగాకుండా వెనుక పేజీలలో వున్న పై సంగతులను కూడా చదివి కథతో పోల్చుకొని నిజానిజాలు తేల్చుకునే అవకాశం ఉండేది.

ఇక కథ సంగతికొస్తే, ఇది ప్రధానంగా ప్రకాశం ఖాకీ బతుకు దినచర్య. అతనికి ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ జరిగిన అనేక సంఘటనలు, తోటి ఉద్యోగుల సాధకబాధకాలు, పోలీసు స్టేషన్ల పనితీరుల కథనం. అదే అతని సుదీర్ఘమైన గతం. 33 సంవత్సరాలపాటు అడుగడుగునా ఎదురైన ఢక్కా ముక్కీలకు తట్టుకుని పనిచేసిన ప్రకాశం ఖాకీ బతుక్కి డిపార్టుమెంటువారు తప్పనిసరి పదవీ విరమణ ఉత్తర్వు ఇవ్వడంతో మొదలవుతుంది.

తరచూ ఇంక్రిమెంట్లు కట్టయినా, బదలీలైనా బాధపడని ప్రకాశంకు ఈ ఉత్తర్వు ఓ అశనిపాతం. తనపై నిష్కారణంగా డిపార్టుమెంటువారు ఇంతకాలంగా క్రమశిక్షణా చర్యల పేరిట వేస్తూవచ్చిన శిక్షలకు ఇది పరాకాష్ఠ. తట్టుకోలేని ప్రకాశం, తన ఉద్యోగ జీవితంలో ఎంతో అవకాశం ఉన్నా తాగని వాడు, తాగి తన గతాన్ని నెమరువేసుకున్నాడు. అలా 5పేజీ నుంచి మొదలైన ప్రకాశం గతం 441పేజీ వరకు ఎడతెరపిలేని సంఘటనలతో సాగుతుంది.

బ్రిటీషు హయాం చివరి దశలో, ఆంధ్ర దేశంలోని ఓ మారుమూల పల్లెటూర్లో ఓ ఆసామి దగ్గర పాలేరు ప్రకాశం. అతను చేస్తున్న వెట్టి చాకిరికి ప్రతిఫలం అంతంతమాత్రమే. పండగపూటైనా కాస్త ఏవైనా కొనుక్కొని హాయిగా ఉందామనుకున్నా తన ఆసామి చిల్లిగవ్వకూడా విదిలించనందుకూ, తనచేతకానితనానికి తిట్టుకుంటూ కూర్చున్న ప్రకాశం వద్దకు వెంకటేశం తెచ్చిన కబురుతో పాలేరు పెకాసం కాస్తా కానిస్టేబులు ప్రకాశం (ఖాకీబతుకు)గా మారుతాడు. అది అతని జీవితంలో ఎన్నో సంఘటనలకు దారి తీస్తుంది.

సాలెగూటిలో చిక్కుకొన్న పురుగులాంటిదే ఈ ఖాకీబతుకు అన్నట్టు ప్రకాశానికి తొలి పోలీసు స్టేషనులో అడుగు పెట్టగానే కనిపించిన సాలెగూడు (81పేజీ వర్ణన) చెబుతుంది. శిధిలావస్థలో ఉన్న స్టేషను, ప్రవేశ ద్వారానికి సరిగ్గా పైన కట్టిన పెద్ద సాలెగూడు, ఆ సాలెగూటిలో చిక్కుకుని గిజగిజాతన్నుకుంటోన్న పురుగు, చిన్నగా దాన్ని సమీపిస్తోన్న సాలెపురుగు, సాలెగూటికంటుకుని చచ్చిన ఈగలు - ప్రకాశాన్ని కలవరపెట్టిన ఈ దృశ్యం, పోలీసు స్టేషన్ల దుస్థితి, ఖాకీబతుకుల పరిస్థితులనే

గాకుండా మొత్తం పోలీసు వ్యవస్థకే అద్దం పడుతోంది. ఆలాగే ప్రకాశం పోలీసు జీవితంలోని ఒక్కో అనుభవం, సాటి ఉద్యోగుల బతుకులు, వారి కుటుంబాలపై వారి ఉద్యోగ ప్రభావం, ఆర్థిక ఇబ్బందులవల్ల ఆ ఉద్యోగాలను వదలిపెట్టలేని వారి పరిస్థితులకు కూడా ఈ దృశ్యం ఒక సంకేతం.

ప్రకాశం జీవితం మొదటినుంచీ ఏదోరకమైన కష్టంతోకూడినదే. పాలేరు పని కష్టమనుకుంటే, పోలీసు డ్యూటీ మరింత కష్టమనిపిస్తుంది. తెల్లదొరల పోలీసు అధికారం భరించలేమనుకుంటే, నల్లదొరల పోలీసు అధికారం అంతకన్నా దుర్భరమనిపిస్తుంది. అలా ప్రకాశం పని పెనంమీదనుంచి పొయ్యిలో పడ్డట్టయింది, పాలేరు జీవితం నుంచి పోలీసు బతుకులోకి మారేసరికి.

ఎంతకాదనుకున్నా ఖాకీబతుకు ప్రకాశాన్ని ఓ మనిషిగాను, అక్షరం ముక్క నేర్చిన వ్యక్తిగాను, లోకం తీరు తెలిసినవాడిగానూ నిలబెట్టింది. ఎన్ని ఒడిదుడుకులు కలిగించినా తనకుటుంబానికి ఓ స్థాయి కల్పించింది. అంతేకాదు, ఖాకీబతుకులోని కర్కశత్వాన్ని ప్రకాశానికి అంటనివ్వలేదు. పైపెచ్చు అదేమని అడగగల ధైర్యాన్నిచ్చింది. అందుకు జాన్, గురవయ్య, సుశీలమ్మ, గోపాలం, నాగేశ్వరరావుల పరిచయాలు ఎంతో దోహదం చేశాయి. అలాగే నరశింహం, చింపిరయ్య, డేవిడ్, సుబ్బారెడ్డి, అబ్దుల్లాల జీవితాలు, వారి అనుభవాలు ప్రకాశాన్ని ఆలోచింపజేశాయి. అయితే, మీరు ఏవిట్లు అని ఎవరైనా తనకులం గురించి అడిగితే లేక అడుగుతారేమోనని అనిపించినా పాలేరుగా ఉన్నప్పుడు ఏమీ అనిపించనిది, పోలీసై నాగరీకుడుగా మారిన తర్వాత ప్రకాశం ఎంతో న్యూనత పడ్డాడు (221 పేజీ).

ప్రకాశం వ్యక్తిత్వం  పరస్పర విరుద్ధమైన భావాలతో కూడినది. తన మతమేదో తనకే తెలీదు, మనమతమసలే పడదు అన్నట్టు ఉంటాడు. తను నాస్తికుడా, ఆస్తికుడా తనకూ తెలీదు, మనకూ అర్థం కాదు. గోపాలం ప్రభావం తనమీదున్నా, అతని నాస్తిక భావాలకు అంతగా లొంగలేదు మరి. ఒకసారి దేవుడిపై నమ్మకం లేదంటాడు (203 పేజీ), మరోసారి నారాయణమూర్తీ నువ్వే నాకు దిక్కు (202 పేజీ) అంటూ కోటయ్యస్వామికి మొక్కుకుంటాడు (289 పేజీ). అలాగే ఒక్కోసారి డబ్బుకు కక్కుర్తి  పడుతుంటాడు. మరోసారి ఎంతో నిజాయితీ పరుడుగా, మామూళ్ళడగాలంటే  తల కొట్టేసినంత పనిగా ఉన్నట్టు ఉంటాడు (342 పేజీ). సామ్యవాదంపై సానుభూతి ఉన్నా, ధనస్వామి దగ్గరి డబ్బులపై ఆపేక్షా ఉంది ప్రకాశంకు.  బహుశ, తనలోని పాలేరు, పోలీసు మనస్తత్వాల మధ్య సంధికాలం వల్ల ప్రకాశం అలా ప్రవర్తిస్తుంటాడనుకోవాలి. ఉద్యోగం వల్ల ఊళ్ళుపట్టి తిరుగుతూ పదుగురితో పరిచయాలున్న ప్రకాశంకన్నా, అతని భార్య మాణిక్యమ్మ పాలేరు పెళ్ళాంకన్నా పోలీసు భార్యగా ఇంట్లోనే ఉంటూ ఇరుగూ పొరుగులతో మాట్లాడుతూ ఎంతో స్తిమితత్వాన్ని, లోతుగా ఆలోచించగల శక్తినీ సంపాయించుకుంటుంది (442 పేజీ). ప్రకాశం పాత్రకు తనతండ్రి జీవితం, ఆయన పోలీసు బతుక్కు స్ఫూర్తి అని రచయిత అన్నా, ఆ పాత్రలోను, మాణిక్యమ్మ, లక్ష్మి, సూర్యంల పాత్రలలో రచయత వ్యక్తిత్వం, ఆలోచనలూ మనకు బాహాటంగానే కనిపిస్తాయి.

ఈ కథలో ప్రకాశం చుట్టుపక్కలవారు, ముఖ్యంగా పై అధికారులు, వారి కుటుంబాలు, తన సాటి ఉద్యోగుల్లోనూ, ఇంకా చెప్పాలంటే పై కులస్తులవారు, ఎవరో ఒకరిద్దరు తప్పించి, అంతా ఎంతో హీనంగా దిగజారిపోయి బతుకుతున్నట్లు రచయిత రాయడంలో ప్రకాశం, అతని కుటుంబం ప్రత్యేకమైనదని ఎత్తి చూపడానికని అనుకోవాలి. రైటరు, సార్జెన్ల దగ్గర్నుంచి పై అధికారులు, వారి కుటుంబాలు, విశ్వనాథం, అతని భార్య, రిటైర్డు పోలీసు శర్మ కుటుంబం ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు. అలాగే ఈ కథలో ప్రకాశం కథానాయకుడు కాబట్టి, చాలామటుకు ప్రతినాయకత్వం వహించింది వీరూ, వీరితోపాటు పోలీసు వ్యవస్థానూ.

కథానాయకుడుగా ప్రకాశం తన పోలీసు జీవితంలో సాధించిందల్లా సొంత ఏరియాకి బదలీ, వీక్లీ ఆఫూనూ. అతని గతంలో ముఖ్యంగా గుర్తుండేవి - సుబ్బారాయుడు పంతులి లాకప్ డెత్, ఓ వివాహిత ఆత్మహత్య, చింపిరయ్య మరణం, అబ్దుల్లా ఏక్సిడెంట్. ప్రకాశం, నేనూ గట్టి వాడినే, నాకూ మనసుందీ అన్నట్టుగా, అప్పుడప్పుడూ పై వాళ్ళతో  పెట్టుకుంటుంటాడు. మామూళ్ళలో న్యాయంగా రావాల్సిన వాటాల కోసం అడుగుతుంటాడు. అలా అడిగినందుకు ఫలితంగా అతనికి ఇంక్రిమెంట్లూ కోత అవుతుంటాయి, కష్టమైన పనులూ నెత్తిన పడుతుంటాయి, దూరప్రాంతాలకు బదలీలూ అవుతుంటాయి. చివరికి అది ప్రకాశం అర్థాంతరంగా, శాశ్వతంగా ఉద్యోగం వదులుకోవాల్సిన పరిస్థితికి దారితీస్తుంది. ఒక్కోసారి పోలీసు స్టేషన్లలో జరిగే దురంతాలను అడ్డుకునే ప్రయత్నంగా అదేమని అడుగుతుంటాడు (మరోసారి తన అశక్తతకు మౌనంగా చూస్తూ ఊరుకుంటుంటాడు). అలా అడిగినప్పుడే ప్రకాశంకు తప్పనిసరి పదవీ విరమణ ఉత్తర్వు పైనుంచి వస్తుంది. అదీ గాయాలతో స్టేషన్ కొచ్చిన ఓ ముసలిదానిపై ఎస్సై చూపిస్తున్న కటువు తీరును ప్రతిఘటించి మానవతా దృష్టితో జాలిపడి సాయం చేయబోయిన ఫలితం. ఆ ఎస్సై ఎమర్జన్సీని అడ్డం పెట్టుకొని ప్రకాశాన్ని తిరుగులేని బలమైన దెబ్బ తీశాడు. వారసత్వంగా తన కొడుక్కి పోలీసు బతుకు వద్దనుకున్నా చేర్పించక తప్పిందికాదు ప్రకాశంకు. ప్రకాశం పాలేరుగా ఉన్నా అలాంటి పరిస్థితి వచ్చేదేమో. కొడుకును పోలీసు ట్రైనింగుకు పంపుతూ ప్రకాశం వెనుదిరిగి భారంగా అడుగులు వేయడంతో ఒక ఖాకీబతుకు ముగుస్తుంది, మరో ఖాకీబతుకు ఆరంభమవుతుంది.

ఈ కథలోని సంఘటనలు మొదట చదువుతున్నప్పుడు ఆసక్తిగా అనిపిస్తాయి. ఆ తర్వాత ప్రకాశం పోలీసు స్టేషనుకు వెళ్ళినప్పుడల్లా ఒహటే సంఘటలు జరగటం వల్ల, ఏ రోజైనా ఏం జరగలేదంటే ఆశ్చర్యపడేంత మామూలై పోతుంది. ఈ పుస్తకం చదివింతర్వాత, పోలీసులు, వారి స్టేషన్ల పై ఉన్న అపోహలు నిజం అనిపిస్తాయి. వారంటే సానుభూతి కలక్కపోగా, మరింత భయాన్ని, జుగుప్సను కలిగిస్తాయి. ఇంతకంటే ఖాకీబతుకుల్లో ఏముంటాయి అనిపిస్తుంది. ఇది మెరుగవ్వాలంటే ఈ పోలీసు వ్యవస్థకు ప్రక్షాళనం జరగాల్సిందే.

***శైలి:*** అన్నీ ఎప్పటికప్పుడు జరిగిన సంగతులే అయినా రచయిత కథనంలో సరళత్వం, కొనసాగింపు, ఓ వరవడి ఉండటంవల్ల పాఠకులను ఆసాంతం చదివింపజేస్తుంది శైలి. రచయిత తనకు మిగతావారిలా వర్ణించడం, రాయడం చేతకాదన్నప్పటికీ చాలా విషయాలను, సంఘటనలను చేయి తిరిగిన రచయితకుమల్లే కళ్ళకు కట్టినట్లుగా వివరించారు. ఓ వివాహిత ఆత్మహత్య, బూటకపు ఎన్ కౌంటర్లు, థర్డ్ డిగ్రీ ఇంటరాగేషన్లు, పెద్ద దొరల పనితీరు, వారి, వారి దొరసానుల జీవనవిధానం, పోలీసు ట్రైనింగు వంటి ఎన్నో విషయాలను మన కళ్ళముందుంచారు. అలాగే, పోలీసులగురించి మనకు తెలిసీ తెలియని సంగతులను చక్కగా వివరించారు. ఒక్కోచోట అవసరానికిమించి మరీ చెప్పారు.

అక్కడక్కడా - ఒక సందర్భంలో ప్రకాశం వాళ్ళ పోలీసులు నాంపల్లి దాదాకోసం హైదరాబాదులోని నాంపల్లిలో విచారించాలనుకోవటం, విజయవాడలోని ఒక వీధిలోని వర్తకులనుంచి దొంగవస్తువులను రాబట్టుకోవటం, అంతా ఒక స్టేషన్నుంచే జరిగినట్లు రచయిత రాయడం వల్ల, వాళ్ళ పోలీసు స్టేషను ఉన్నది విజయవాడలోనా లేక హైదరాబాదులోనా అని తికమక పడతాం, వంటి - కొన్ని చిన్నచిన్న లోటుపాట్లున్నా, రచయిత మొదటి ప్రయత్నంలోనే శభాష్ అని అనిపించుకొన్నారు. మొదటినుంచీ కథనంలో ఉన్న మంచి బిగింపు మధ్యలో సడలిపోయి చివరికి తేలిపోతుంది. పతంజలి ఖాకీవనం తర్వాత వచ్చిన ఈ ఖాకీబతుకులు, ఇతివృత్తం ఆసక్తిగలదవటంవల్ల పాఠకుడిని ఒకసారి చదివింపజేస్తుంది. మొత్తానికి స్పార్టకస్ ఒక స్పార్క్ అయి సంచలనం సృష్టించారు.

రెండో ముద్రణైన ఈ పుస్తకం, మరోసారి సభ్యుల మధ్య దాదాపు రెండున్నర గంటలపాటు సుదీర్ఘ చర్చకు దారితీయటమే ఇందుకు నిదర్శనం. పై అభిప్రాయాలకు అందరూ ఏకీభవిస్తూనే, తమ తమ భిన్నాభిప్రాయాలనూ వ్యక్తపరిచారు. బ్రిటీషువారి హయాంలో కాస్తోకూస్త చదువుకున్నవారికే ఉద్యోగాలకు కొరవేలేదు. మరి పదోతరగతిదాకా చదువుకొన్న గురవయ్య ఈ ఖాకీబతుకే శరణ్యమనుకోవటం వింతగా అనిపించింది. అలాగే, పోలీసు వ్యవస్థ ప్రక్షాళనంపై సుదీర్ఘమైన చర్చ జరిగింది. పోలీసు వ్యవస్థ, వారి స్వామిభక్తి సాధారణంగా పాలకుల, వారి పాలనా విధానాన్ని బట్టి మారుతుంటుంది, ధనస్వాముల పాలనలో వారికి అనుకూలంగాను, సామాన్యులకు వ్యతిరేకంగాను పోలీసువ్యవస్థ తీరు ఉండవచ్చు, అలాగే పెట్టుబడిదారీ విధానంలోపోలీసువ్యవస్థ వారికి అనుకూలంగా ఉంటుంది. అయతే ఇందులో వినియోగదారులకు రక్షణ దొరుకుతుంది. ఎందుకంటే, ఈ వ్యవస్థలో వినియోగదారులకు ప్రాముఖ్యం ఉంటుంది అన్న అభిప్రాయం వ్యక్తమైంది. ఇలాగే ఖాకీబతుకుల్లోని వివిధ అంశాలపై రసవంతమైన చర్చ జరిగింది.

Copyright: Detroit Telugu Literary Club